## క్లుప్తంగా

### నేడు శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ భూముల కౌలు వేలం

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి ఉన్న యోగానంద శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి ఆలయానికి చెందిన భూముల కౌలు వేలం పాట శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ హేమలతాదేవి తెలిపారు. గురువారం ఆమె వివరాలు తెలుపుతూ వత్సవాయి మండలం భీమవరం గ్రామంలో సర్వే నెంబరు. 66లోని స్వామివారికి చెందిన 19.32 ఎకరాలకు బహిరంగ కౌలు వేలంను గ్రామ సచివాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు వేలం పాటలో పాల్గొనాలని ఆమె కోరారు.

### విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



కంచికచర్ల: స్టాక్ బోర్డులో అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని విత్తన డీలర్లకు ఇంటర్నల్ స్క్వాడ్ అధికారి శశికళ సూచించారు. కంచికచర్లలో పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను గురువారం రాత్రి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు స్క్వాడ్ అధికారి శశికళ మాట్లాడుతూ దుకాణాల్లో స్టాక్ బోర్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. స్టాక్ వివరాలు, లైసెన్స్, బిల్ పుస్తకాలు, సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్లు అందుబాటులో ఉండాలని సూచించారు. అంతేకాకుండా ఎంఆర్పీ ధరలు, స్టాక్ రిజిస్టర్, స్టాక్ ఫాం–బీలు కూడా తెలియజేయాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం స్టాక్‌ను పరిశీలించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి కే విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ

చెన్నారావుపాలెం(వీరులపాడు): విద్యార్థులు పట్టుదలతో చదువుకుని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సర్పంచ్ పత్తిపాటి మల్లికార్జునరావు పేర్కొన్నారు. మండలంలోని చెన్నారావుపాలెం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు, యూనిఫాం, బూట్లను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. చదువుతోనే గ్రామాభివృద్ధి, సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో దక్షిణామూర్తికి గురువారం విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. స్వామి వారి విగ్రహానికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు. అనంతరం పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు మల్లేశ్వర శాస్త్రి పర్యవేక్షణలో నిర్వహించారు. పూజా కార్యక్రమాలను భక్తులు వీక్షించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

# అక్రమంగా నల్లమట్టి నిల్వలు

- ఇటుక బట్టీల కోసం చెరువు నుంచి తరలింపు
- పొలం లీజుకు తీసుకుని దాంట్లో స్టాకు ఏర్పాటు



మంగొల్లు గ్రామ శివారులో ఇటుక బట్టీల కోసం నిల్వ ఉంచిన నల్లమట్టి కుప్పలు

మంగొల్లు(వత్సవాయి): చెరువుల్లో ఉండే సారవంతమైన మట్టిని రైతులు తమ పొలాలకు తోలుకుని మరింత సారవంతం చేసుకుంటారు. లేదా చౌడు భూములకు నల్లమట్టి తోలితే అది సారవంతమై పంటకు అనుకూలిస్తుందని తోలుకుంటారు. లేదా పల్లపు పొలాలను మెరక చేసుకునేందుకు గ్రామాల్లో ఉన్న చెరువుల నుంచి నల్లమట్టి పొలాలకు తోలుకుంటారు. కానీ ఇవేవి పట్టకుండా కేవలం వ్యాపారం కోసమే మంగొల్లు చెరువు నుంచి భారీ స్థాయిలో నల్లమట్టిని తరలిస్తూ స్టాకు పెడుతున్నారు. నల్లమట్టిని స్టాకు పెట్టేందుకు ఏకంగా సుమారు రెండు మూడు ఎకరాల పొలాలను లీజుకు తీసుకుని దాంట్లో డంపింగ్ చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు.

**ఇటుక బట్టీల కోసం మట్టి నిల్వలు..**

జగ్గయ్యపేట, చిల్లకల్లు, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లోని ఇటుక బట్టీల కోసం ఈ నల్లమట్టి స్టాకు పెడుతున్నట్లు మంగొల్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇటుక తయారు చేసేందుకు మట్టి దొరక్కపోవడంతో దూర ప్రాంతాల నుంచి మట్టిని తరలించుకుంటారు. అయితే స్థానిక నాయకుల అండతో చెరువు మట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. ఇటుకకు మంచి డిమాండ్ ఉండటంతో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల వ్యాపారులు ఇక్కడకు వచ్చి బట్టీలను ఏర్పాటు చేసుకుంటూ వ్యాపారం చేస్తున్నారు. ఇదే అదనుగా స్థానిక నాయకులు మట్టిని అమ్ముకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సుమారు రెండు వేలకు పైగా ట్రాక్టర్ల మట్టిని స్టాకు పెట్టినట్లు సమాచారం. రైతులు తమ పొలాలకు చెరువు మట్టిని అనుమతి లేకుండా తరలించకూడదని, తరలిస్తే కేసులు నమోదు చేసే అధికారులు గ్రామంలో పట్టపగలు వందలాది ట్రాక్టర్లు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. చెరువులో కూడా పెద్ద ఎత్తున గుంతలు పెట్టడం వల్ల గేదెలు చెరువుల్లోకి దిగితే ప్రమాదం ఉందని వాపోతున్నారు. పైగా చెరువుమట్టిని ట్రాక్టర్లలో తరలించే క్రమంలో రహదారులపై మట్టి పడుతుంది. అసలే వర్షాకాలంలో చిన్నపాటి జల్లులు పడితే ద్విచక్ర వాహనదారులు జారి కింద పడుతున్నారు. అధికారులు స్పందించి అక్రమ చెరువు మట్టి రవాణాను అడ్డుకోవాలని కోరుతున్నారు. అక్రమ చెరువుమట్టి రవాణాపై తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

# రైతులకు వడ్డీలేని రుణాలు అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రూ. 3 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చుండూరు సుబ్బారావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గురువారం నందిగామ తహసీల్దార్ సరస్వతికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రూ. 20 వేలు ఈ ఖరీఫ్ సీజన్‌లోనే రైతులకు అందజేసేలా కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా పావలా వడ్డీతో రూ. 5 లక్షల వరకు రుణాలు అందజేయాలని కోరారు. ముఖ్యంగా కౌలు రైతులను వెంటనే గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేయడంతో పాటు రుణాలను ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కొనసాగుతున్న ఇంటింటి సర్వే



షేర్‌మహ్మద్‌పేటలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

జగ్గయ్యపేట: మండలంలోని పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కొనసాగుతోంది. గత వారం రోజులుగా పలు గ్రామాల్లో డయేరియా వ్యాప్తి చెందుతుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, ఎంఎల్‌హెచ్‌పీలు సర్వే చేస్తున్నారు. గురువారం షేర్‌మహ్మద్‌పేట, గండ్రాయి, అనుమంచిపల్లి, బూదవాడ, అన్నవరం గ్రామాల్లో బూచవరం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి అనిల్‌కుమార్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది సర్వే చేస్తున్నారని తెలిపారు. సర్వే చేసిన గ్రామాల్లో మరోసారి రీసర్వే చేస్తామని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితులు, డయేరియా లక్షణాలు కనిపిస్తే వారిని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. షేర్‌మహ్మద్‌పేట, గండ్రాయి, బూదవాడ గ్రామాల్లో డయేరియా అదుపులో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# దోమల నివారణ మందు ఫాగింగ్



పేటలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది



గండేపల్లిలో దోమల నివారణ మందు ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య సిబ్బంది వార్డుల్లో దోమల నివారణ మందును ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య సిబ్బంది పలు వార్డులతో పాటు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఫాగింగ్ చేశారు.

**గండేపల్లిలో శానిటేషన్ పనులు**

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లిలో శానిటేషన్ పనులు గురువారం చేపట్టామని సర్పంచి బొక్కా రవికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు వస్తాయని అవి దరిచేరకుండా ఉండాలంటే కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. మురుగునీటి కాల్వల్లో చెత్తాచెదారాన్ని తొలగించామని తెలిపారు. గ్రామంలో, స్థానిక బాలికల వసతిగృహంలో దోమల నివారణ కోసం ఎబేట్‌ను పిచికారి చేయించామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, స్టాఫ్ నర్స్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### వారసత్వ కట్టడాలను కాపాడుకుందాం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రపంచ వారసత్వ సంపదైన కట్టడాలను ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్‌లో డిస్పాచ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సిబ్బందిని గురువారం చైర్మన్ అభినందించారు. మోటపోతుల ఉదయ్ నాగభూషణం, షేక్ నయీమ్ పాషాలు భారతదేశంలో ఉన్న పురాతన వారసత్వ కట్టడాలను అతి తక్కువ సమయంలో సందర్శించి రికార్డు సృష్టించారు. ఈ నేపథ్యంలో చైర్మన్ చలసాని ఆంజనేయులను కలిసి పర్యటన వివరాలను తెలియజేశారు.

### విద్యార్థులకు నోట్ పుస్తకాల వితరణ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని తొర్రగుంటపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదివే 50 మంది పేద విద్యార్థులకు గురువారం స్థానిక విశ్రాంత కోపరేటివ్ బ్యాంకు మేనేజర్ బాణాల సత్యనారాయణ నోట్ పుస్తకాలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఒక్కొక్క విద్యార్థికి నాలుగు నోట్ పుస్తకాలతో పాటు పెన్సిళ్లు, ఎరేజర్‌లు, షార్పనర్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం పరమేశ్వరరావు ఆధ్వర్యాన తొర్రగుంటపాలెం హైస్కూల్ హెచ్ఎం పద్మ సమక్షంలో సత్యనారాయణరావును సన్మానించారు. పాఠశాల బోధనా సిబ్బంది నాగజ్యోతి, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

### హెలెన్ కెల్లర్ జీవితం ఆదర్శనీయం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పీడబ్ల్యూబీడీ (దివ్యాంగ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్) ఆధ్వర్యంలో 'హెలెన్ కెల్లర్' 144వ జయంతిని గురువారం అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసోసియేషన్ చైర్మన్ రామకృష్ణ పాల్గొని హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెలెన్ కెల్లర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దివ్యాంగ ఉద్యోగులు తమలో దాగి ఉన్న ప్రతిభతో రైల్వేకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. దివ్యాంగ ఉద్యోగులు ఆత్మస్థైర్యంతో తమ వ్యక్తిగతంతో పాటు రైల్వే అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిందిగా దిశానిర్దేశం చేశారు. అనంతరం ఈ నెలలో పదవీవిరమణ చేయనున్న దివ్యాంగ ఉద్యోగులు మహాలక్ష్మి, సురేష్‌బాబు, నాగరాజులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పర్సనల్ బ్రాంచ్ ఏపీఓ అనురాధ మాట్లాడుతూ సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్ సారథ్యంలో వినూత్న మార్గాల ద్వారా దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించామన్నారు. అందుకోసం తనను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ విజయవాడ డీఎస్ ఆమంచి వెంకటేశ్వరరావు, ఆర్ఎంయూ ఏడీఎస్ శేఖర్‌బాబు, అసోసియేషన్ డీఎస్ శివకుమార్, జగదీష్, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ రామ్మోహనరావు



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

కంచికచర్ల: సరైన సమయంలో రక్తం దొరక్కపోవడం వల్ల చాలా మరణాలు సంభవిస్తున్నాయని, వాటిని ఆపాలంటే ప్రతి ఒక్కరూ రక్తాన్ని దానం చేయాలని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ రామ్మోహనరావు విద్యార్థులకు సూచించారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన తెనాలి శారద సర్వీస్ సొసైటీ సౌజన్యంతో 'రక్తదానం దాని ఆవశ్యకత అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తాన్ని దానం చేయడం వల్ల ఆరోగ్యం బాగుండటమే కాకుండా ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ డి.శారద మాట్లాడుతూ ప్లేట్‌లెట్స్, ప్లాస్మా, రెడ్‌బ్లడ్ సెల్స్‌ను ఏ విధంగా ఎవరెవరికి ఉపయోగించాలో వివరించారు. బ్లడ్ బ్యాంకులో నిల్వ ఉండే బ్లడ్ ఎంత దుర్వినియోగం అవుతోందో తెలియజేశారు. బ్లడ్‌ను దానం చేసేవారు రిజిస్టర్‌లో వారి పేర్లను నమోదు చేసుకున్నట్లయితే బ్లడ్ వృథా కాకుండా ఉపయోగించే విధానాన్ని, లైవ్ బ్లడ్ బ్యాంకు ఆవశ్యకతను వివరించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పీ చిరంజీవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన పత్తి సాగు

- వర్షాలు మొదలు కావడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు
- నియోజకవర్గంలో 17,175 హెక్టార్లలో సాగు చేస్తారని అధికారుల అంచనా



పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళా రైతు

నందిగామ: నందిగామ ప్రాంతంలో కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు ఖరీఫ్ సాగుకు శ్రీకారం చుట్టారు. వాస్తవానికి ఈ సంవత్సరం ముందుగానే ఋతుపవనాలు వస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పినప్పటికీ జూన్ మూడో వారం వరకు వర్షాలు ప్రారంభం కాలేదు. దీనికి తోడు వేసవికాలంలో మాదిరిగా భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ప్రస్తుతం గత కొద్దిరోజులుగా వర్షాలు మొదలు కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ఎక్కడ చూసినా పొలం పనుల్లో కర్షకులు హడావిడిగా కనిపిస్తున్నారు.

**పత్తి సాగుకు సిద్ధం..**

వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారుల లెక్కల ప్రకారం నందిగామ నియోజకవర్గంలో 34,483 హెక్టార్ల సాగుభూమి ఉంది. దీనిలో ప్రధానంగా పత్తి పంట సాగవుతుంది. వర్షాలు ప్రారంభం కావడంతో ఇప్పటికే వేసవి దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచిన పంట పొలాల్లో రైతులు సాగును ప్రారంభించారు. అధికారుల లెక్కల ప్రకారం నియోజకవర్గంలో ఈ సంవత్సరం 17,175 హెక్టార్లలో రైతులు పత్తి పంటను సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 997 హెక్టార్లలో రైతులు పత్తి విత్తనాలు విత్తినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వర్షాలు ప్రారంభం కావడంతో సాగు మరింత వేగవంతమయ్యే అవకాశం ఉందని ఏడీఏ శ్రీనివాస్ తెలిపారు.

# అభివృద్ధే ఎజెండాగా పనిచేద్దాం



ఎక్స్ అఫిషియో సభ్యునిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య



పారిశుద్ధ్యంపై మాట్లాడుతున్న కౌన్సిల్ సభ్యులు

**ఎమ్మెల్యే తాతయ్య**

జగ్గయ్యపేట అర్బన్: పేట పట్టణ అభివృద్ధే ఎజెండాగా పార్టీలకతీతంగా పనిచేసి మున్సిపాలిటీకి మంచిపేరు తీసుకువద్దామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో మున్సిపల్ చైర్మన్ ఆర్.రాఘవేంద్ర అధ్యక్షతన గురువారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే తాతయ్య పాల్గొని ఎక్స్ అఫిషియో సభ్యునిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కమిషనర్ నాగ మల్లేశ్వరరావులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేట పురపాలక సంఘ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకువచ్చి అన్ని వార్డులను అభివృద్ధి పథంలో పయనింపజేస్తామని, అందుకు కౌన్సిల్ సభ్యులంతా సహకరించాలని సూచించారు. అనంతరం సభ నుంచి ఎమ్మెల్యే తాతయ్య వెళ్లిపోగా కౌన్సిల్ అత్యవసర సమావేశం మొదలైంది.

**పారిశుద్ధ్యంపై రాజీ పడే ప్రసక్తే లేదు..**

పారిశుద్ధ్యంపై శానిటరీ విభాగం అధికారులు, ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర పేర్కొన్నారు. సమావేశంలో పలువురు సభ్యులు పారిశుద్ధ్యం మీద ఏకరువుపెట్టారు. చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో శానిటేషన్ విషయంలో కౌన్సిలర్లు ఎవరూ సంతోషంగా లేరన్నారు. పనిచేయకుండా రిజిస్టర్‌లో సంతకం పెట్టి బయటకు వెళ్లిపోతున్న మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పనితీరు మారకుంటే వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పాలకవర్గ సభ్యుడు వట్టెం మనోహర్, కొలగాని రాము, గింజుపల్లి వెంకట్రామయ్య, పందుల రోశయ్య, సుందరమ్మ పారిశుద్ధ్య నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ప్రతిపక్ష సభ్యులు వెంకట్, గీతారాణి, కర్ల శాంతకుమారి, అలేఖ్య, సంధ్యారాణి తదితరులు పలు సమస్యలను ప్రస్తావించారు. అనంతరం ఎజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. వైస్ చైర్మన్ హఫీజున్నీసా, కమిషనర్ నాగ మల్లేశ్వరరావు, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# దౌర్జన్యకాండ పునరావృతం కాకుండా తీర్మానం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో ఈనెల 25న బయట వ్యక్తులు చేసిన దౌర్జన్యకాండ భవిష్యత్‌లో పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకునే నిమిత్తం పాలకవర్గ సభ్యులు తీర్మానం చేశారు. ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అధ్యక్షతన అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వార్డు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూర్ణ మాట్లాడుతూ.. గ్రామ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా పంచాయతీ కార్యాలయంలో బయట వ్యక్తులు వీరంగం సృష్టించడం దారుణమన్నారు. గ్రామ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలన్న ఉద్దేశంతో అత్యవసర సమావేశం నిర్వహించి పాలకవర్గ సభ్యులచే తీర్మానించామని చెప్పారు.

- మైలవరం: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 29న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని మైలవరం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం. శివపార్వతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైలవరం కోర్టు పరిధిలో సివిల్, క్రిమినల్, మనోవర్తి, బ్యాంక్ కేసులను రాజీ చేసుకుని సమయం, డబ్బు ఆదా చేసుకోవాలని చెప్పారు.







## హలో.. ఆపండి బాస్!

విజయవాడ నగరం.. అందులోను బందర్ రోడ్డు.. అక్కడ ట్రాఫిక్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కరలేదు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలు జరుగుతుంటాయి. అలాంటిది కొంత మంది మాత్రం తమ ద్విచక్రవాహనాలను నడుపుతూనే సెల్‌ఫోన్‌లో నిమగ్నం అయిపోతున్నారు. ఈ చిత్రాలు చూడండి.. ఏదో మెసేజ్ వచ్చిందనో, లేక కాల్ లిఫ్ట్ చేయాలనో తొందరపడుతున్నారు. ఆ సమయంలో ఇక ఎదురు ఎవరున్నారు? వెనుక, పక్కన ఎవరు వస్తున్నారన్న ధ్యాస ఉండటం లేదు. ఇక నిబంధనలు గురించి ఆలోచనే ఉండటం లేదు. ఒక చేత్తో ఫోన్.. మరో చేత్తో బండి యాక్సలరేటర్ పట్టుకొని దూసుకెళ్తున్నారు. ఇది అనేక అనర్థాలకు దారితీస్తోంది. క్షణాల్లో జీవితాలను తలకిందులు చేస్తోంది. సెల్ ఫోన్ డ్రైవింగ్ నేరమని తెలిసినా యథేచ్ఛగా వినియోగిస్తుండటం ఆందోళన కల్గిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ